మాగంటికి ఘన నివాళి

సంస్మరణ కార్యక్రమంలో నివాళులర్పించిన మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యేలు

భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

బంజారాహిల్స్, జూన్ 18: జూబ్లీహిల్స్ దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సంస్మరణ కార్యక్రమం బుధవారం జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, కేపీ.వివేకానంద్, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ, పువ్వాడ అజయ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు విష్ణువర్ధన్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, శంకర్ నాయక్, దయాకర్‌రావు, తాతా మధు, నారదాసు లక్ష్మణ్‌రావు, ఎంఎన్.శ్రీనివాస్, రావుల శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు దేదీప్యరావు, రాజ్‌కుమార్ పటేల్, వెల్దండ వెంకటేశ్, సంగీతాయాదవ్ తదితరులు మాగంటి గోపీనాథ్‌కు నివాళులర్పించి మాగంటి కుటుంబసభ్యులను పరామర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంతో పాటు పలు నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి తమ అభిమాన నేత చిత్రపటానికి నివాళులర్పించారు. 'జై గోపన్న' నినాదాలతో జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్ మార్మోగింది.



మాగంటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు తలసాని, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ డా.దాసోజు శ్రవణ్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ తదితరులు

మాగంటి కుటుంబసభ్యులతో కేటీఆర్ కుమారుడు హిమాన్షు

జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులు

అందాల పోటీలకు మొత్తం ఖర్చు ఎంత?

వై.సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 18(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవం విదేశీ మహిళల కాళ్ల దగ్గర తాకట్టు పెట్టిన ఖర్చు అక్షరాలా రూ.4 కోట్లుగా చూపెట్టారని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్, రెడ్కో మాజీ చైర్మన్ వై.సతీశ్‌రెడ్డి తెలిపారు. రామప్ప ఆలయాన్ని సందర్శించిన మిస్ వరల్డ్ పోటీదారుల కాళ్లను తెలంగాణ ఆడబిడ్డలతో కడిగించడం విమర్శలకు దారితీసిందని గుర్తు చేశారు. ఆ ఒక్కరోజు ఈవెంట్ కోసం రూ.4 కోట్లకు పైగా ఖర్చు చేసినట్టు ప్రభుత్వమే ఒప్పుకుందని తెలిపారు. ఈ పోటీలకు రూ.30కోట్ల ఖర్చు పెట్టామని పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు లెక్కలు చెబుతున్నారని, కానీ కొన్ని గంటల ఈవెంట్‌కే రూ.4కోట్లు ఖర్చు పెట్టారంటే మొత్తం కార్యక్రమాలకు రూ.200 కోట్లకంటే ఎక్కువే ఖర్చయినట్టు స్పష్టమవుతున్నదని తెలిపారు.

షాహీన్ ఆస్పత్రిలో తనిఖీలు

చార్మినార్, జూన్ 18: 'నగరంలో నకిలీ వైద్యులు' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యాధికారులు స్పందించారు. ప్రత్యేకంగా నాలుగు టీంలను ఏర్పాటు చేసిన జిల్లా వైద్యాధికారులు మంగళ, బుధవారం రెండు రోజుల పాటు షాహీన్ ఆసుపత్రిలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఆసుపత్రిలో జరిగిన చికిత్సలు, పేషంట్ల వివరాలను సేకరించారు. ఆసుపత్రి నిర్వహణ, అనుమతులు పొందిన వారి వివరాలు, బీయూఎంఎస్ సర్టిఫికెట్లతో చికిత్సలు కొనసాగించిన వారి వివరాలను సేకరించారు. రిపోర్టును జిల్లా వైద్యాధికారులకు అందిస్తామని అధికారులు వెల్లడించారు.

హైదరాబాద్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీ

సుల్తాన్‌బజార్, జూన్ 18: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, హైదరాబాద్ డిపో -1 గానుగపూర్, షిరిడీ టూర్లకు ప్రత్యేక ప్యాకేజీకి శ్రీకారం చుట్టింది. గానుగాపూర్, షిరిడీలకు వెళ్లే భక్తులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని హైదరాబాద్ డిపో-వన్ మేనేజర్ కృష్ణారెడ్డి కోరారు. వారాంతాల్లో పుణ్యక్షేత్ర దర్శనాలకు వెళ్లాలనుకునే భక్తుల సౌకర్యార్థం ఈనెల 26వ తేదీన హైదరాబాద్-1 డిపో ఆధ్వర్యంలోఎంజీబీఎస్ నుంచి (నాన్ ఏసీ - పుష్ బ్యాక్ సీట్స్) నడుపుతున్నట్లు ఆయన వివరించారు. ఈనెల 27న సాయంత్రం 5గంటలకు మహాత్మా గాంధీ బస్‌స్టేషన్ నుంచి బయలుదేరుతాయని, ఈ సర్వీస్‌లో గానుగపూర్‌లోనిదత్తాత్రేయ స్వామి, పండరిపూర్‌లోని విఠలేశ్వర స్వామిదర్శనం, తులజాపూర్‌లో భవాని మాత దర్శనం అనంతరం చేరుకుంటుందన్నారు.

షిరిడీ వెళ్లేవారు..

భక్తుల సౌకర్యార్థం ఈనెల 27న హైదరాబాద్-1 డిపో వారిచే ఎంజీబీఎస్ నుంచి షిరిడీకి సూపర్ లగ్జరీ బస్సు(నాన్ ఏసీ పుష్ బ్యాక్ సీట్స్) నడుపబడుచున్నది. ఈనెల 27న సాయంత్రం మహాత్మా గాంధీ బస్ స్టేషన్ నుంచి బయలుదేరుతాయన్నారు. సీట్లు బుక్ చేసుకునే వారు www.tgsrtcbus.in, వివరాలకు ఫోన్ నంబర్లు, డిపో మేనేజర్, హైదరాబాద్-1 డిపో: 995 9226248, 998522 3761, 944 05663 79, 7382824794లో సంప్రదించాలని కోరారు.

మాకు ఐడీ కార్డులు ఇవ్వండి

సిటీబ్యూరో:ఆషాఢమాసంలో బోనాల సమయంలో తమకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చాలాకాలం నుంచి అమ్మవారితో అనుబంధంగా ఉంటున్న తమకు ప్రత్యేక గుర్తింపు కార్డులివ్వాలంటూ దేవాదాయశాఖ అధికారులను జోగినీలు కోరారు. బుధవారం బొగ్గులకుంటలోని దేవాదాయ ధర్మాదాయశాఖ కార్యాలయంలో బోనాల సందర్భంగా జోగినీలకు కావాల్సిన ఏర్పాట్లపై దేవాదాయశాఖ, పోలీసు అధికారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జోగినీలు అధికారులకు సమస్యలను వివరించారు. దేవాదాయ అధికారులు జోగినీలు చెప్పిన సమస్యలపై త్వరలోనే ఇతర శాఖలతో కూడా సమావేశమై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, డైరెక్టర్ వెంకట్రావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, హైదరాబాద్ అడిషనల్ సీపీ విక్రమ్‌మాన్‌సింగ్, దేవాదాయశాఖ అధికారులు కృష్ణవేణి, రామకృష్ణారావు, జోగినిలు శ్యామల, నిషాక్రాంతి, స్వర్ణలత పాల్గొన్నారు.

ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టి.. హనీ ట్రాప్‌చేసి..

మహిళ పేరుతో ఫేస్‌బుక్‌లో చాటింగ్‌చేసి రిటైర్డ్ ఉద్యోగికి వల.. రూ.38.73లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

సిటీబ్యూరో, జూన్ 18(నమస్తే తెలంగాణ): నగరానికి చెందిన ఓ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి(75)ని సైబర్ నేరగాళ్లు హనీ ట్రాప్‌చేసి రూ.38.73లక్షలు కాజేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ సంవత్సరం మొదట్లో వృద్ధుడికి ఫేస్‌బుక్‌లో ఓ మహిళ పేరుతో ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. అతను యాక్సెప్ట్ చేయగా..ఆ మహిళ అతనితో చాటింగ్ చేసింది. తమ తండ్రి వదిలేశాడని, తల్లి టైలర్ అని పరిచయం చేసుకుంది. తనకు చాటింగ్ చేసేందుకు వైఫై సదుపాయం కల్పించాలని అతనికి కేబుల్ ఆపరేటర్ నంబర్ ఇచ్చింది. వెంటనే అతను.. కేబుల్ ఆపరేటర్ నంబర్‌కు ఫోన్‌చేసి రూ.10వేలు పంపాడు. ఆ తర్వాత ఆ మహిళ నుంచి ఫేస్‌బుక్‌లో ఎలాంటి స్పందన రాలేదు. దీంతో ఆ విశ్రాంత ఉద్యోగి.. కేబుల్ ఆపరేటర్‌తో చాటింగ్ చేయగా ఆమె జబ్బు పడిందని చెప్పగా.. రూ.10లక్షలు పంపాడు. ఆ తర్వాత తన క్రెడిట్ కార్డు నుంచి మరో రూ.2.65 లక్షలు పంపించాడు. కొన్నిరోజుల తర్వాత ఆ మహిళ దుబాయ్ వెళ్లిపోయిందని, ఆమె కాంటాక్ట్స్ ఏమీలేవని చెప్పాడు. అయితే.. తన తల్లి, సోదరి మీతోతో మాట్లాడాలనుకుంటున్నారని కేబుల్ ఆపరేటర్ చెప్పారు. ఆ తర్వాత వారి ఫేస్‌బుక్ ఖాతాల నుంచి అతనికి రిక్వెస్ట్ రావడంతో వారితో చాటింగ్ చేశాడు. కొన్ని రోజుల తర్వాత లైంగిక పరమైన అంశాలపై చాటింగ్ చేసుకున్నారు. ఈ విషయంపై ఆ అమ్మాయి మైనర్ అంటూ ఇందులో అసభ్యకరంగా చాటింగ్‌చేసి వేధించావని పోలీసులకు ఫిర్యాదు చేస్తానంటూ కేబుల్ ఆపరేటర్ అతనిని బెదిరించాడు. ఆ తర్వాత ఒకరు వాట్సప్‌లో కాల్‌చేసి తాను కానిస్టేబుల్‌నని, వారితో వెంటనే సెటిల్ చేసుకోవాలంటూ చెప్పాడు. దీంతో ఆ రిటైర్డ్ ఉద్యోగి.. బాలిక చదువు, ఆమె తల్లి డ్వాక్రా రుణం చెల్లింపు కోసం రూ. 12.5లక్షలు చెల్లించాడు. ఆ తర్వాత కానిస్టేబుల్ ఈ విషయం ఎస్సైకి తెలిసిందని దీనిపై కేసు కాకుండా ఉండాలంటే డబ్బులు చెల్లించాలంటూ మళ్లీ రూ. లక్షలు తెప్పించుకున్నాడు. ఆ తర్వాత తన కోసం రూ.లక్ష కావాలంటూ అడుగగా పంపించాడు. మరోసారి ఫోన్ చేసిన కానిస్టేబుల్ కొత్త ఎస్సై వచ్చాడని, అతనికి విషయం తెలిసి పోక్సో కేసు పెడతానంటున్నాడంటూ చెప్పి.. రూ.10లక్షలు కావాలని డిమాండ్ చేయగా రూ.7లక్షలు పంపించాడు. ఇలా ఎస్ఐ, కానిస్టేబుల్ పేర్లతో ఫోన్ కాల్స్ చేస్తూ, మెసేజ్‌లు పెడుతూ విడతల వారీగా బాధితుడి నుంచి రూ.38.73లక్షలు దోచుకున్నారు. మరోసారి డబ్బులు డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు చివరకు సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటన ఫేస్‌బుక్ పరిచయాలు, హనీట్రాప్‌లను సూచిస్తున్న నేపథ్యంలో రిటైర్డ్ ఉద్యోగులు, వృద్ధులు ఎవరి ట్రాప్‌లో పడొద్దంటూ పోలీసులు సూచించారు.

కన్న కొడుకే కాలయముడై..

తండ్రిని బండరాయితో మోది హత్యచేసిన కిరాతకుడు

కందుకూరు మండలం పులిమామిడిలో దారుణం

కందుకూరు, జూన్ 18: కన్నకొడుకే ఆ తండ్రి పాలిట యముడిలా మారాడు. ఎన్నిసార్లు చెప్పినా తమకున్న భూమిని అమ్మనివ్వడం లేదనే కోపంతో ఎవరూ లేని సమయంలో తండ్రి నెత్తిన బండరాయితో మోది కడతేర్చాడు. ఈ అమానవీయ ఘటన రంగారెడ్డి జిల్లా కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పులిమామిడిలో చోటుచేసుకుంది. కందుకూరు సీఐ సీతారాం వివరాల ప్రకారం.. పులిమామిడికి చెందిన పసుపుల చిన్న జంగయ్య (65) గొర్రెల కాపరి. అతడికి భార్య పద్మ, ముగ్గురు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. జంగయ్య పేరుమీద అదే ఊరిలో 20 గుంటల భూమి ఉంది. కాగా భూమిని అమ్ముదామని గత కొంతకాలంగా జంగయ్య కొడుకు పసుపుల శేఖర్ తరచూ తల్లిదండ్రులతో గొడవ పడుతుండేవాడు. ఇటీవల తల్లిదండ్రులు కొత్త ఇంటి నిర్మాణం చేస్తుండగా.. తిరిగి శేఖర్ తన తండ్రితో గొడవపడ్డాడు. ఈ విషయమై పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టించినా కూడా శేఖర్ ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో శేఖర్ తన భార్యాపిల్లలతో కలిసి వేరే ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. జంగయ్య, పద్మ నిర్మాణంలో ఉన్న ఇంటి స్లాబ్ కింద ఉంటున్నారు. మంగళవారం రాత్రి జంగయ్య, తన భార్య పద్మమ్మ, కొడుకు శేఖర్.. ముగ్గురూ కలిసి భోజనం చేసిన తర్వాత.. పద్మమ్మ అదే ఊరిలో ఉండే తన 2వ కూతురు ఇంటికి వెళ్లి పడుకుంది. చంద్రయ్య ఇంటి స్లాబ్ కింద పడుకున్నాడు. భూమి అమ్ముడానికి తన తండ్రి అంగీకరించడం లేదని కోపం పెంచుకున్న శేఖర్.. స్లాబ్ కింద ఒంటరిగా నిద్రిస్తున్న తండ్రి జంగయ్య తలపై బండరాయితో మోది హత్యచేశాడు. తల్లి పద్మమ్మ ఇంటికి వచ్చి చూడగా చంద్రయ్య రక్తపు మడుగులో చనిపోయి కనిపించాడు. భూమిని అమ్మనివ్వడం లేదనే కోపంతో తన కొడుకు శేఖరే.. తన భర్తను చంపిఉంటాడని పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి

కవాడిగూడ, జూన్ 18ః స్థానిక సంస్థల సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచిన తర్వాతనే ఎన్నికలు జరపాలని పలు పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం కల్పిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు వద్ద మహాదీక్షను చేపట్టారు. ఈ దీక్షా కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ మధుసూదనాచారి, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, కాంగ్రెస్ సంవిదాన్ బచావో కమిటీ చైర్మన్ డాక్టర్ వినయ్‌కుమార్ ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బిసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకులు దాసు సురేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ జనాభాకు అనుగుణంగా 42 శాతం రిజర్వేషన్లకు అనుగుణంగా ప్రత్యేక జీవోను జారీ చేసి తొమ్మిదవ షెడ్యూల్‌లో రిజర్వేషన్లను చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ దీక్షా కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ సమన్వయకర్త గుజ్జకృష్ణ, నాయకులు వేముల రామకృష్ణ, నందగోపాల్, డి.నరహరి, శ్రీనివాస్, రజని, విమల, పద్మావతి, సుధాకర్, జగదీష్, సతీష్ తదితరులతో పాటు పలు పార్టీల నాయకులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐఓబీసీఎస్ఏ నాయకులు

బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చాలి

21న ఓయూలో సత్యాగ్రహ దీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లును తక్షణమే భారత రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఓబీసీఎస్ఏ) డిమాండ్ చేసింది. ఈ డిమాండ్‌తో ఏఐఓబీసీఎస్ఏ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఈనెల 21వ తేదీన సత్యాగ్రహ దీక్ష నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జాతీయ కార్యదర్శి మహేశ్ గౌడ్ తెలిపారు. ఈ దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్, మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీలకు విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై స్పందించని పక్షంలో ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఓబీసీఎస్ఏ నాయకులు లక్కీ, రామ్ గౌడ్, ప్రశాంత్, కళ్యాణ్ యాదవ్, శివ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి తెలంగాణ షూటింగ్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గచ్చిబౌలి సాట్స్ షూటింగ్ రేంజ్ వేదికగా ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు 11వ రాష్ట్రస్థాయి షూటింగ్ చాంపియన్‌షిప్ జరుగనున్నది. ఈ విషయాన్ని తెలంగాణ రైఫిల్ అసోసియేషన్(టీఆర్ఏ) బుధవారం అధికారిక ప్రకటనలో పేర్కొంది. షూటింగ్‌ను అందరికీ దగ్గర చేయాలనే ఉద్దేశంతో ఈసారి ఔత్సాహిక షూటర్లకు టీఆర్ఏ అవకాశం కల్పిస్తున్నదని అధ్యక్షుడు అమిత్ సంఘీ తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1,250 మంది షూటర్లు టోర్నీలో పోటీపడే అవకాశముందన్నారు. టోర్నీలో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్-పిస్టల్, 25 మీటర్ల రైఫిల్-పిస్టల్, 50 మీటర్ల రైఫిల్-పిస్టల్, షాట్‌గన్, స్కీట్‌షూటింగ్, డబుల్ ట్రాప్ విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి.

నేడు జీహెచ్ఎంసీలో స్టాండింగ్ కమిటీ సమావేశం

11 అంశాలపై చర్చించనున్న సభ్యులు

సిటీబ్యూరో, జూన్ 18(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం గురువారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరగనున్నది. ఈ సమావేశంలో 11 అంశాలపై సభ్యులు చర్చించనున్నారు. వీధిలైట్ల నిర్వహణలో భాగంగా గడువు ముగిసిన ఈఈఎస్ఎల్ సంస్థకు రెండు నెలల పాటు గడువు పొడిగింపు, కొత్త ఏజెన్సీకి పనుల అప్పగించే అంశంతోపాటు సీఎస్ఆర్ పద్ధతిలో నిర్వహించే కార్యక్రమాలకు ఆమోదించనున్నారు. ఖైరతాబాద్ జోన్ సర్కిల్-17లోని నాగార్జున సర్కిల్, సోమాజిగూడ సర్కిల్ 2800 స్క్వేర్ మీటర్ల పరిధిలో మలబార్ రాయల్ డిజైన్ సంస్థ మూడేళ్ల పాటు సీఎస్ఆర్ పద్ధతిలో సుందరీకరణ పనులు చేపట్టనున్నది. ఇందుకు జీహెచ్ఎంసీతో ఎంఓయూ కుదుర్చుకోనున్నది. దీంతో పాటు ఎల్బీనగర్ జోన్ ప్రియదర్శినీ పార్కు రోడ్డులో రూ.5.9 కోట్లతో వరద నీటి కాలువ నిర్మాణ పనులు, ఐటీ విభాగంలో మొబైల్ ఫీల్డ్ వర్కర్స్ యూజర్ టైప్ విధానానికి అనుమతి ఇవ్వనున్నారు. రెండు పడక గదుల సముదాయాలలో మౌలిక వసతుల కల్పన, నిర్వహణ పనులపై చర్చించనున్నారు. రాధాకృష్ణనగర్ రైల్వే స్టేషన్ పేరుతో కొత్తగా స్టేషన్ ఏర్పాటుతోపాటు మూడు నెలల ఆదాయ వ్యయాలపై సభ్యులు చర్చించనున్నారు.

డబుల్ బెడ్రూం ఇండ్లు ఇప్పిస్తామంటూ మోసం..

నలుగురు నిందితులు అరెస్ట్

సిటీబ్యూరో, జూన్ 18(నమస్తే తెలంగాణ): డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇప్పిస్తామంటూ ఫేక్ అలాట్‌మెంట్ లెటర్ల తో అమాయకులను మోసం చేస్తున్న నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో బుధవారం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర ఈ అరెస్ట్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, నార్త్‌జోన్ బృందం, బండ్లగూడ పోలీసులతో కలిసి ఈ ఇండ్ల స్కామ్‌లో ప్రధాన నిందితులైన మహ్మద్ అహ్మద్, మహ్మద్ అమ్జద్, మీర్‌కౌసర్‌అలీ, కొత్తకోట రాజ్‌కుమార్‌రెడ్డిలను అరెస్ట్ చేశారు. బండ్లగూడలో డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చి.. 25 నుంచి 30 మంది నుంచి డబ్బులు తీసుకుని మోసం చేశారు. ప్రధాన నిందితుడు మహ్మద్ అహ్మద్ ఏసీ టెక్నీషియన్‌గా, రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా పనిచేస్తూ.. స్నేహితుడు అమ్జద్ అలియాస్ మునావర్‌తో కలిసి డబుల్‌బెడ్రూం పథకం కింద ప్లాట్లు అందించే ముసుగులో డబ్బులు వసూలు చేయాలని ప్లాన్ చేశారు. ఇందుకోసం వారు బండ్లగూడలోని డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కొత్తకోట రాజ్‌కుమార్ రెడ్డి అలియాస్ రాజును సంప్రదించారు. బాధితుల నుంచి రూ.50వేల నుంచి రూ.1.7లక్షల వరకు వసూలు చేయగా.. అతని నుంచి రాజు కమీషన్ తీసుకునేవాడు.

ఆ తర్వాత గోల్కొండకు చెందిన మీర్‌కౌసర్ అలీ అలియాస్ సిరాజ్.. తన బంధువులతో కొంతమందిని కమీషన్ ఆధారంగా అహ్మద్ వద్దకు పంపించాడు. ఈ కేటాయింపు కోసం కొంతమంది దగ్గర రూ.2.22లక్షలు డిమాండ్ చేశారు. అహ్మద్.. బాధితులకు ఫేక్ అలాట్‌మెంట్ ఆర్డర్ల కాపీలు ఇచ్చారు. ఇందుకోసం వేరొకరికి కేటాయించిన ఒరిజినల్ కాపీని పిక్స్‌ఆర్ట్ యాప్‌లో సవరించి.. కేటాయింపు ఆర్డర్ల కాపీల ఖాళీ పత్రాలను తయారుచేసి, వాటిని బాధితుల పేరుతో నింపేవాడు. అంతేకాకుండా ఆ కాపీలపై ఆర్డీఓ హైదరాబాద్ సంతకాన్ని అంటించి దానిపై సీల్ వేసేవాడని పోలీసులు చెప్పారు. ఇలా బండ్లగూడ, అంబర్‌పేట, మంగళ్‌హాట్, మాదన్నపేట, గోల్కొండ, నల్లకుంట, అత్తాపూర్‌లతో పాటు ఇతర ప్రాంతాల నుంచి బాధితులను ట్రాప్ చేసి వారి నుంచి రూ.42.35లక్షలు వసూలు చేశారని డీసీపీ సుధీంద్ర తెలిపారు. నిందితుల నుంచి 11 ఫేక్ ఆర్డర్ కాపీలు, స్టాంపులు, రూ.5.5లక్షల డబ్బులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ గురునాథ్, నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు జ్ఞానదీప్, రాఘవేందర్‌రెడ్డి, బండ్లగూడ ఎస్ఐ నాగరాజ్‌రెడ్డి, కానిస్టేబుల్స్ సాగర్, ఇమ్రాన్‌లతో పాటు నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్, బండ్లగూడ పోలీసు బృందాలను డీసీపీ అభినందించారు.

యువకుడిని కొట్టి చంపేశారు..

కొండాపూర్, జూన్ 19 : కల్లు కాంపౌండ్ వద్ద జరిగిన గొడవలో ఓ యువకుడిని కొట్టి చంపారు. ఈ ఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం... వికారాబాద్ జిల్లా తాండూర్ మండలం, సిరిగిరిపేట గ్రామానికి చెందిన మాసాన్పల్లి రామచందర్, అమరేశ్ (23)లు నగరానికి వలసవచ్చి లింగంపల్లిలో రాపిడో నడుపుకుంటున్నారు. రాత్రి వేళలో లింగంపల్లి రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారంపై పడుకుంటూ పనులు చేసుకుంటున్నారు. కాగా.. మంగళవారం రాత్రి రైల్వే స్టేషన్ సమీపంలోని కల్లు కాంపౌండ్‌కు ఇరువురు వెళ్లారు. అక్కడే ఉన్న ఓ మహిళ.. అమరేశ్‌ను అడ్డుకుని వారం క్రితం మా ఆడమనిషిని బైక్‌పై ఎక్కించుకుని ఎక్కడికి తీసుకెళ్లావురా అంటూ గొడవకు దిగింది. రాంచందర్ గొడవ ఆపేందుకు ప్రయత్నించగా.. పక్కనే ఉన్న మరో మహిళ వీడియోకాల్ చేసి ఇద్దరు వ్యక్తులను అక్కడికి పిలిచి, అమరేశ్‌ను కొట్టాలని చెప్పింది. దీంతో రెచ్చిపోయిన ఆ ఇద్దరు.. అమరేశ్‌ను కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. వెంటనే రాంచందర్.. అమరేశ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, 100 డయల్ ద్వారా పోలీసులకు సమాచారం అందజేశాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు ..108సిబ్బంది సహాయంతో అమరేశ్‌ను పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. యువకుడిని కొట్టి చంపి నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం

నగరంలో డ్రగ్స్, గంజాయి విక్రయాలు

8 మంది అరెస్ట్.. పరారీలో ఒకరు

సిటీబ్యూరో, జూన్ 18 (నమస్తే తెలంగాణ): బెంగుళూరు కేంద్రంగా నగరంలో డ్రగ్స్ విక్రయాల కు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులతో పాటు ముగ్గురు వినియోగదారులను ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌టీఎఫ్ సీఐ భిక్షారెడ్డి కథనం ప్రకారం...నగరానికి చెందిన వరాల దీక్షిత్, కొండబోయిన వరణ్‌తేజ్‌లు బెంగుళూరు నుంచి తక్కువ ధరకు ఎండీఎంఏ డ్రగ్స్‌ను కొనుగోలు చేసి.. నగరంలోని పరిచయస్తులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ అధికారులు బుధవారం అమీర్‌పేట ప్రాంతంలో డ్రగ్స్ విక్రయిస్తుండగా దీక్షిత్, వరుణ్‌తేజ్‌లను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులతో పాటు డ్రగ్స్ కొనుగోలు చేయడానికి వచ్చిన భాషాపాగ ప్రవీణ్‌రాజ్ , ఎండీ అస్లామ్ హుస్సేన్ , సంగ ప్రేమ్ సాయిలను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 6.34 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాడు ల్లో ఎస్‌టీఎఫ్ టీమ్-బీ ఎస్ఐ బాలరాజు, సంధ్య పాల్గొన్నారు. తదుప